సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 28 । ఆగస్టు । 2023



నిలిచిన భారీ వాహనం
దారాలమ్మ ఘాట్ రోడ్డు గుడి కింద మలుపు వద్ద భారీ వాహనం ప్రధాన రోడ్డు మార్గంలో ఆదివారం నిలిచిపోయింది. 8లో



విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీతగుంట ఎంపీటీసీ సభ్యుడు బొంజుబాబు అధికారులను కోరారు. 8లో



భారీగా బ్లాక్ ఆయిల్ స్వాధీనం
డీజిల్ కల్తీకి వినియోగిస్తున్న 7,180 లీటర్ల బ్లాక్ ఆయిల్‌ను అచ్యుతాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 8లో

న్యూస్‌రీల్

నేడు ఐటీడీఏలో పీఎఫ్ అదాలత్

సాక్షి,పాడేరు: పీఎఫ్ ఖాతాదారులు, పింఛనుదారుల సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఈనెల 28వతేదీ సోమవారం ఉదయం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో పీఎఫ్ అదాలత్ నిర్వహిస్తున్నామని విశాఖ రీజనల్ పీఎఫ్ నోడల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేవీ కృష్ణమోహన్ తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని పీఎఫ్ ఖాతాదారులు, పింఛనుదారులు ఎలాంటి సమస్యలు ఉన్నా అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పింఛనుదారులు ఏటా సమర్పించే లైఫ్ ధ్రువపత్రాన్ని అందజేయాలని ఆయన కోరారు.

విద్యుత్ సౌకర్యానికి దరఖాస్తుల స్వీకరణ

- ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్

సాక్షి,పాడేరు: జిల్లాలోని విద్యుత్ సదుపాయం లేని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని విద్యుత్ పంపిణీ సంస్థ విశాఖపట్నం ఆపరేషన్స్ ఎస్ఈ మహేంద్రనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సౌకర్యానికి నోచుకోని గ్రామాల్లో జీవిస్తున్న కుటుంబాల వివరాలతో గిరిజనులు మండల పరిషత్, విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు. పరిశీలన అనంతరం సౌకర్యం కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ఫిష్ ఆంధ్రా అమ్మకాలు ప్రారంభం



ముంచంగిపుట్టులో ఫిష్ ఆంధ్రా మొబైల్ వాహనం వద్ద కొనుగోలుదారులు

ముంచంగిపుట్టు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ వాహనంలో ఫిష్ ఆంధ్రా పేరుతో చేపల అమ్మకాలు ఆదివారం మండల కేంద్రంలో ప్రారంభమయ్యాయి. స్థానిక అంబేడ్కర్ పార్క్ సమీపంలో వాహనం వద్ద చేపల కొనుగోలుకు స్థానికులు ఆసక్తి చూపారు. నాణ్యమైన చేపలు విక్రయించడంతో అమ్మకాలు భారీగా జరిగాయి. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 60 శాతం రాయితీపై మొబైల్ వాహనాన్ని అందించిందని ఫిష్ ఆంధ్రా లబ్దిదారుడు బాలకృష్ణ తెలిపారు.

కొయ్యూరులో భారీ వర్షం



కొయ్యూరు: మండల కేంద్రంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. రోడ్లు జలమయం అయ్యాయి. వారపు సంతపై తీవ్ర ప్రభావం చూపింది. నాలుగైదు రోజులుగా ఏదొక సమయంలో వర్షం కురుస్తూనే ఉంది. దీంతో వరి నాట్లు జోరందుకున్నాయి. ఇప్పటివరకు 1600 ఎకరాల్లో నాట్లు వేశారు. బూదరాళ్ల, యూ.చీడిపాలెం,ఎం భీమవరం ప్రాంతాల్లో గిరి రైతులు రాజ్‌మా సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే విత్తనాల పంపిణీ మొదలైంది.

మోటార్ బైక్‌లు ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు



గాయపడిన యువకులకు రాజవొమ్మంగిలో చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము శివారు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు, 108 సహాయంతో క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం గోపాలపట్నంకు చెందిన వీరంరెడ్డి రాజు, కొప్పుల శివ పెళ్లి శుభలేఖలు పంచిపెట్టేందుకు మోటారు సైకిల్‌పై ఆదివారం దూసరపాము వచ్చారు. వారు తిరిగి స్వగ్రామం వెళుతుండగా ఎదురుగా మరో మోటారు సైకిల్‌పై వస్తున్న వాసంశెట్టి అప్పన్నబాబును ఢీ కొట్టారు. ఈ ఘటనలో ముగ్గురి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురికి స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. వారి పరిస్థితి ఆందోళన కరంగా ఉన్నట్టు వైద్య సిబ్బంది తెలిపారు.

డిసెంబర్ నాటికి సొంతిల్లు



దాలిగుమ్మడిలో శ్లాబ్ దశలో ఉన్న ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న గృహ నిర్మాణ సంస్థ అధికారులు

జిల్లాలోని పేదలందరికీ సొంతిళ్లు ఉండాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న ప్రభుత్వం పీఎంఏవై–వైఎస్సార్ పథకంలో 17,111 గృహాలను మంజూరు చేసింది. వీటిలో 15,768 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో గృహ నిర్మాణ శాఖ చర్యలు చేపట్టడంతో పేదలకు సొంతింటి కల నెరవేరనుంది.

- నాలుగు నెలల్లో పేదలకు నెరవేరనున్న సొంతింటి కల
- జిల్లాకు 17,111 గృహాలు మంజూరు
- 15,768 నిర్మాణాలను ప్రారంభించిన లబ్ధిదారులు
- యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా అధికారుల చర్యలు

సాక్షి,పాడేరు: జిల్లాలో ఇళ్లు లేని పేద గిరిజనులకు పక్కా గృహాలను నిర్మించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. పీఎంఏవై–వైఎస్సార్ గ్రామీణ్ పథకంలో మంజూరైన ఇళ్లకు సంబంధించి నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. 22 మండలాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 17,111 ఇళ్లను మంజూరు చేసింది. వీటిలో 15,768 ఇళ్ల నిర్మాణం చేపట్టగా ఇప్పటివరకు 424 పూర్తయ్యాయి. మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయి. మిగిలిన 8శాతం లబ్ధిదారులు వివిధ కారణాలతో ముందుకు రాలేదు.

వివిధ దశల్లో ఇలా..

జిల్లాకు మంజూరైన 17,111 ఇళ్లలో 6,900 పునాదుల స్థాయిలో ఉన్నాయి. మరో 4,486 ఇళ్లు గోడల దశలో, 2,595 ఇళ్లకు గోడలు పూర్తయ్యాయి. మిగతా 1387 ఇళ్ల నిర్మాణాలు శ్లాబ్ తదితర దశల్లో ఉన్నాయి. 424 ఇళ్లను మాత్రం లబ్ధిదారులు పూర్తి చేశారు. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేసే లక్ష్యంతో గృహ నిర్మాణశాఖ పనిచేస్తోంది.

- ఇంటి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం రూ.1.80 లక్షలు చెల్లిస్తోంది. వీటిలో 1.50 లక్షలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్నాయి. ఎన్‌ఆర్ ఈజీఎస్‌లో కూలీ పనుల రూపంలో రూ.12వేలు, బాత్‌రూమ్‌కు రూ.18 వేల చొప్పున చెల్లిస్తోంది.

ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి చర్యలు



జిల్లా వ్యాప్తంగా వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను ఇంజనీరింగ్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కూడా ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షించి,లబ్ధిదారులకు సాంకేతిక సహకరం అందిస్తున్నారు. గిరిజనులకు నాణ్యతతో కూడిన అందమైన పక్కా గృహ నిర్మాణం లక్ష్యంగా పనిచేస్తున్నాం.ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం.బిల్లుల చెల్లింపులు పారదర్శకంగానే జరుగుతున్నాయి – బాబునాయక్, ఇన్‌చార్జి పీడీ, గృహనిర్మాణ సంస్థ, పాడేరు

- లబ్ధిదారులకు నిధుల కొరత లేకుండా ఇళ్ల నిర్మాణాలు జరిగిన స్థాయికి తగ్గట్టుగా అధికారులు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తున్నారు. 15,768 ఇళ్ల నిర్మాణాల్లో 424 పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. ఇంతవరకు రూ.6047.15లక్షల మేర బిల్లులను లబ్ధిదారులకు చెల్లించారు. లబ్ధిదారుడి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో బిల్లు సొమ్మును ప్రభుత్వం జమచేస్తోంది.

అంధత్వాన్ని జయించి..



ట్రోఫీతో రవణి, విజయం సాధించిన జట్టులో రవణి

- అంతర్జాతీయ క్రికెట్ పోటీల్లో సత్తాచాటిన రవణి
- విజయంతో ఆనందం పంచుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు



రవణి కుటుంబ సభ్యులకు స్వీట్లు తినిపిస్తున్న నైని సత్తిబాబు, ఎంపీటీసీ రజని

హుకుంపేట: మండలంలోని మెరకచింత పంచాయతీ రంగసింగిపాడు గ్రామానికి చెందిన వలసనైని రవణి క్రికెట్ క్రీడలో విశేష ప్రతిభ కనబరిచింది. ఇంగ్లాండ్‌లోని బర్మింగ్ హామ్ ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో జరిగిన ఇంటర్నేషనల్ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ (ఐబీఎస్ఏ–2023) ప్రపంచ క్రీడా పోటీల్లో ఆమె భారత మహిళా అంధుల జట్టులో ఆడి విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించింది. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు, గ్రామస్తులకు స్థానిక ఎంపీటీసీ నైని రజని, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు మిఠాయిలు పంచి సంతోషం పంచుకున్నారు. తమ కుమార్తె ఉన్నత స్థాయికి ఎదగడంతో ఎంతో ఆనందంగా ఉందని తల్లిదండ్రులు గోపాలకృష్ణ, చిట్టెమ్మ పేర్కొన్నారు. రవణి విశాఖపట్నం జిల్లా భీమిలి బీచ్ రోడ్డులోని వారిజ నేత్ర విద్యాలయంలో టెన్త్ వరకు చదివింది. ఇక్కడే శిక్షణ పొందింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని అదే నేత్ర విద్యాలయంలో ఇంటర్ చదువుతూ క్రీడల్లో శిక్షణను కొనసాగిస్తోందని ఆమె తల్లిదండ్రులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ప్రమాదంపై సమగ్ర విచారణ

- వివరాలు సేకరించిన కమిటీ సభ్యులు
- ఈడీకి నివేదిస్తామని వెల్లడి



పాడేరు జిల్లా ఆస్పత్రిలో కోలుకుంటున్న క్షతగాత్రుడితో మాట్లాడుతున్న విచారణ అధికారులు

సాక్షి, పాడేరు: ఇటీవల పాడేరు ఘాట్‌లోని వ్యూపాయింట్ సమీపంలో లోయలోకి ఆర్టీసీ బస్సు దూసుకుపోయిన ప్రమాద సంఘటనపై ప్రభుత్వం విచారణ వేగవంతం చేసింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రయాణికులు మృతిచెందారు. మరో 30మంది గాయపడ్డారు. ఈ ఘోర ప్రమాదంపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఆర్టీసీ ఈడీ సి.రవికుమార్ ముగ్గురు అధికారులతో విచారణ కమిటీని ఏర్పాటుచేశారు. విశాఖపట్నంలోని జిల్లా ప్రజారవాణా శాఖాధికారి ఏ.అప్పలరాజు, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ ఏ.వెంకటరావు, విజయనగరానికి చెందిన చెందిన డిప్యూటి చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ డి.అప్పలనాయుడుతో ఏర్పాటైన కమిటీ ఆదివారం పాడేరు ప్రాంతంలో పర్యటించింది. ముందుగా పాడేరు ఘాట్‌లోని సంఘటన ప్రాంతాన్ని కమిటీ సభ్యులు పరిశీలించారు. బస్సు లోయలోకి దూసుకుపోయిన ఘటనకు సంబంధించి స్థానిక ఆర్టీసీ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. అలాగే పాడేరు జిల్లా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న క్షతగాత్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్సు ప్రమాద ఘటనపై అన్ని కోణాల్లోను సమగ్ర విచారణ జరిపి, ఆర్టీసీ ఈడీకి నివేదిక అందిస్తామన్నారు. పాడేరు ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, ఇతర సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌లో ఉన్న ముగ్గురు సీఐలకు పోస్టింగ్

- మరో ముగ్గురికి అటాచ్‌మెంట్

సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్‌లో వీఆర్‌లో ఉన్న ఆరుగురు సీఐల్లో ముగ్గురికి పోస్టింగ్ కల్పిస్తూ, మరో ముగ్గురిని స్టేషన్లకు అటాచ్‌చేస్తూ డీఐజీ హరికృష్ణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న కె.కుమార్‌స్వామిని అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్ వీఆర్‌కు,ఎస్.రామకృష్ణను శ్రీకాకుళం వీఆర్‌కు, ఎస్.వేణుగోపాలరావును మన్యం పార్వతీపురం జిల్లా వీఆర్‌కు అటాచ్ చేశారు. శీరా భాస్కర్‌రావుకు శ్రీకాకుళం దిశ పోలీస్‌స్టేషన్‌లో, పి.కోటేశ్వరరావుకు శ్రీకాకుళం ఎస్పీ కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచ్‌లో సీఐలుగా పోస్టింగ్ ఇచ్చారు. ఎస్.కామేశ్వరరావుకు శ్రీకాకుళం జిల్లా గార పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ సీఐగా పోస్టింగ్ కల్పించారు.

ప్రయత్నిస్తే విజయం తథ్యం

- డీఎస్పీగా ఎంపికైన చిట్టపులి జీవన పడాల్
- కిలగాడలో ఆత్మీయ కలయిక



డీఎస్పీగా ఎంపికైన జీవనపడాల్‌ను సత్కరిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు

ముంచంగిపుట్టు: ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే ప్రయత్నంలో లోపం లేకుండా కృషి చేస్తే కచ్చితంగా విజయం తథ్యం అవుతుందని డీఎస్పీగా ఎంపికైన చిట్టపులి జీవన పడాల్ అన్నారు. డీఎస్పీగా ఎంపికైన ఆమె స్వగ్రామమైన మండలంలోని కిలగాడలో ఆదివారం కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల సమక్షంలో ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఆమెను పూలమాలలతో సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు. ఆదివాసీ బిడ్డగా ఉన్నత స్థాయికి ఎదిగిన ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచి తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహం మరువలేనిదని, డాక్టర్ కావాలనే లక్ష్యంగా పెట్టుకుంటే.. డీఎస్పీగా ప్రజలకు సేవ చేసే అవకాశం భగవంతుడు ఇచ్చారన్నారు. గిరిజన యువత, యువకులకు నేటి సమాజంలో అనేక అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె పేర్కొన్నారు. సర్పంచ్ కె.శివశంకర్, రిటైర్డ్ అసిస్టెంట్ ట్రెజరీ అధికారి ఆర్.నాగభూషణ్‌రాజు, ఎంఈవో బాబూరావు, పద్మాపురం బొటానికల్ గార్డెన్ మేనేజర్ ఎల్.బొంజుబాబు,వైఎస్సార్‌సీపీ మండల నేతలు జి.సూరయ్య, జి.రామ్మూర్తి, ఉపాధ్యాయులు సీహెచ్.భాస్కరరావు, రాంప్రసాద్, అప్పారావు, శ్రీనివాస్‌పడాల్, వైద్యాధికారి సింధూరాణి, గ్రామ పెద్ద ఎల్.కేశవరావు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య



ఉరి వేసుకున్న పరమేశ్వరరావు

పాడేరు రూరల్: మతి స్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాడేరు మండలం కొత్తపాడేరు గ్రామానికి సమీపంలోని మెట్ట బంగ్లా వద్ద పాడుబడిన ఓ రేకుల షెడ్డులో ఫ్యాన్ హుక్కుకు ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు ఆదివారం గుర్తించారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ లక్ష్మణరావు సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి జేబులో ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా వివరాలు తెలుసుకున్నారు. విశాఖ నగరంలోని సింధియాలో లచ్చయ్యగారి పరమేశ్వరరావు(38)గా గుర్తించామని ఎస్ఐ తెలిపారు. ఇదే విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశామని ఆయన పేర్కొన్నారు. పరమేశ్వరరావుకు మతిస్థిమితం సరిగ్గా లేదని, ఈ నేపథ్యంలో ఈనెల 25న ఇంట్లో గొడవపడి బయటకు వచ్చేశాడని వారు తెలిపారన్నారు. అప్పటినుంచి అతనికోసం గాలిస్తున్నామని కుటుంబ సభ్యులు చెప్పారని ఆయన వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గిరిజన చట్టాలు పటిష్టంగా అమలుతోనే మనుగడ



మాట్లాడుతున్న రాకేష్‌నాయక్

అరకులోయ రూరల్: పటిష్టంగా గిరిజన చట్టాలు, హక్కులు అమలుచేస్తేనే ఆదివాసీలకు మనుగడ ఉంటుందని మానవ హక్కుల నేరనిరోధక సంఘ జాతీయ అధ్యక్షుడు బోడ రాకేష్‌నాయక్ పేర్కొన్నారు. స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులు, చట్టాలను పటిష్టం అమలుచేయకుంటే భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మణిపూర్‌లో ప్రోత్సహించిన హింసాత్మక ఘటనలు మాదిరిగానే ఇతర దేశాల్లో కూడా చోటుచేసుకునే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల నేరనిరోధక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కృష్ణకుమారి, జిల్లా అధ్యక్షుడు పి.ధర్మ, ఉద్యోగ ప్రజా సంఘాల నాయకులు బాలాజీ, బురిడి ఆనంద్, నందో పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మికి ఘన సత్కారం



కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిని సత్కరించి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షురాలిగా రెండవ సారి నియమితులైన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పార్టీ నేతలు ఆదివారం సాయంత్రం ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. పాడేరులోని ఆమె క్యాంపు కార్యాలయానికి చేరుకున్న వారంతా శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి నాయకత్వంలో 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జిల్లా నాయకత్వంను తనకు మరోసారి అప్పగించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లంగి ఉమామహేశ్వరరావు, పెదబయలు జెడ్పీటీసీ కూడా బొంజుబాబు, అరకు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎల్.బి.కిరణ్, సర్పంచ్ కామేష్, బీసీసెల్ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు గడ్డం నరసింగరావు పాల్గొన్నారు. ఇలావుండగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి ఆదివారం పాడేరు,అరకు నియోజకవర్గాలకు చెందిన నాయకులు,కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అభినందనలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, పాడేరు మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, పార్టీ పీఆర్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు పాల్గొన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర,ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సిరగం దశమూర్తిలను జిల్లా అధ్యక్షురాలు,ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సత్కరించారు.

మన్యంలో ట్రైనీ కలెక్టర్ల పర్యటన



తాజంగిలో నిర్మిస్తున మ్యూజియం వద్ద ట్రైనీ కలెక్టర్ల బృందంతో స్థానిక అధికారులు

చింతపల్లి రూరల్: మన్యంలో ఆదివారం 14 మంది ట్రైనీ కలెక్టర్లు పర్యటించారు. శిక్షణలో భాగంగా మన్య ప్రాంత ప్రజల స్థితిగతులు, వారి జీవన శైలి, గిరిజన సంప్రదాయం, ఆచార వ్యవహారాలను తెలుసుకున్నారు. వీరిలో ఏడుగురు మండలంలోని తాజంగిలో నిర్మిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం కట్టడాన్ని, లంబసింగి పీహెచ్‌సీని సందర్శించారు. మిగిలిన వారు గూడెంకొత్తవీధి మండలంలోని దుప్పులవాడ గ్రామాన్ని సందర్శించారు. గిరిజనుల అలవాట్లను తెలుసుకున్నారు. వారం రోజులపాటు వారు మన్యంలోని వివిధ ప్రాంతాలను సందర్శించనున్నారు.

కరాళ చందనం అరగదీత ప్రారంభం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం కరాళ చందనం అరగదీతని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈనెల 31న శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామికి సుమారు పది కిలోల కరాళ చందనాన్ని సమర్పిస్తారు. ఈ మేరకు కరాళ చందనం అరగదీతని చేపట్టారు.

పర్యాటక ప్రాంతాల్లో సండే సందడి

వంజంగి హిల్స్‌పై మంచు అందాలు కనువిందు



వంజంగి హిల్స్‌పై పొగమంచు అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి మండలాల్లో పర్యాటకుల రాకతో రద్దీగా కనిపించాయి. పాడేరుకు సమీపంలోని వంజంగి హిల్స్‌కు భారీగా తరలివచ్చారు. పొగమంచు అందాలు కనువిందు చేశాయి. జాతీయ జెండా ప్రాంతంలో పర్యాటకులు సందడి చేశారు. అనంతగిరిలోని కటికి ,డుంబ్రిగుడలోని చాపరాయి, జి.మాడుగులలోని కొత్తపల్లి జలపాతాలకు పర్యాటకులు భారీగానే తరలివచ్చారు. బొర్రా గుహలు,పద్మాపురం గార్డెన్,గిరిజన మ్యూజియం, లంబసింగి,తాజంగి ప్రాంతాల్లో ప్రకృతి అందాలను పర్యాటకులు తిలకించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



లంబాడి ప్రదర్శన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది



ఆదివాసీ వేషధారణ విద్యార్థినులతో గురుకులాల జాయింట్ సెక్రటరి రమణమూర్తి

ఘనంగా రాష్ట్రస్థాయి సంస్కృతి సంబరాలు

అరకులోయ రూరల్: స్థానిక యండపల్లి వలస గురుకుల పాఠశాల ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి 4వ సంస్కృతి సంబరాల్లో భాగంగా ఆదివారం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గురుకులాల జాయింట్ సెక్రటరీ రమణమూర్తి మాట్లాడుతూ గిరి విద్యార్థులను అన్నిరంగాల్లో తీర్చిదిద్దేందుకే ప్రభుత్వం 1998లో ఏకలవ్య పాఠశాలలను ప్రారంభించిందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. యువతీ యువకులు పాఠశాలలో క్రమశిక్షణతో మెలిగి ఉన్నతమైన విద్యావంతులుగా రాణించాలని సూచించారు. ఏకలవ్య పాఠశాలల ప్రిన్సిపాళ్లు మూర్తి, సన్యాసినాయుడు, భాస్కర్‌రావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

సెల్ఫీ తీసుకుంటూ..

- పవర్ కెనాల్‌లో జారిపడిన యువకుడు గల్లంతు
- గాలిస్తున్న పోలీసులు



జేకాస్ (ఫైల్)

మోతుగూడెం: పోర్‌బై జలాశయం పవర్ కెనాల్లో చత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంట గ్రామానికి చెందిన జేకాస్ (30) అనే యువకుడు ఆదివారం గల్లంతయ్యాడు. ఐదుగురు స్నేహితులతో కలిసి విహార యాత్రకు వచ్చిన అతను పవర్‌కెనాల్ వద్ద సెల్ఫీ తీసుకునే సమయంలో జారి కెనాల్‌లో పడిపోయాడు. ప్రవాహంఉధృతిగా ఉన్నందున స్నేహితులు ప్రయత్నించినా రక్షించలేకపోయారు. గల్లంతైన యువకుడు కోసం గాలింపు చేపట్టినట్టు ఎస్ఐ గోపాలరావు తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పెదబయలు: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీతగుంట ఎంపీటీసీ సభ్యుడు కె. బొంజుబాబు చెప్పారు. ఇటీవల అనారోగ్యంతో ఉన్న గురుకులు రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థి కె.చంటిబాబు, స్థానిక కేజీబీవీ విద్యార్థిని పి.రాణిను విద్యార్థులే ఆస్పత్రికి తీసుకొచ్చారని, నిర్వాహకులు లేనట్టు ఆరోపించారు. దీనిపై కళాశాల, ప్రిన్సిపాల్, ఎస్‌వోపై ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. ఈ విషయంపై గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరమ్మను 'సాక్షి' వివరణ కోరగా విద్యార్థికి బాగా లేకపోవడంతో హౌస్ టీచర్, ఏఎన్ఎం భర్త ఆస్పత్రిలో చేర్పించారని విద్యార్థి ఆరోగ్యం ప్రస్తుతం బాగానే ఉందన్నారు. ఈ విషయంపై స్థానిక ఏటీడబ్ల్యూవో స్వర్ణలత మాట్లాడుతూ కళాశాల, పాఠశాల విద్యార్థులకు బాగా లేకపోతే సిబ్బందే ఆస్పత్రికి తీసుకుని వెళ్లారని, ఇద్దరు విద్యార్థుల ఆరోగ్యం బాగానే ఉందని అనారోగ్యంతో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల, కళాశాల సిబ్బందికి సూచించినట్టు తెలిపారు.

నిలిచిన భారీ వాహనం

- ఘాట్‌రోడ్డులో నాలుగు గంటల పాటు స్తంభించిన రాకపోకలు

సీలేరు: దారాలమ్మ ఘాట్ రోడ్డు గుడి కింద మలుపు వద్ద భారీ వాహనం ప్రధాన రోడ్డు మార్గంపై ఆదివారం నిలిచిపోయింది. దీంతో నాలుగు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. చింతూరు నుంచి పెంటపాడు వద్ద హైవే నిర్మాణానికి సంబంధించిన మిషన్ తీసుకువెళ్తూ దారాలమ్మ తల్లి రోడ్డులో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో లారీ రోడ్డుకు అడ్డంగా ఎటూ కదలకుండా ఇరుక్కుపోయింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దారకొండ గ్రామం నుంచి లారీ డ్రైవర్ ట్రాక్టర్లను తీసుకెళ్లి రోడ్డు మార్గం పక్క నుంచి వాహనాలు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. అనంతరం లారీని పక్కకు తీయడంతో రాకపోకలు పునరుద్ధరణతో ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది.

6 నుంచి స్కౌట్స్ జాతీయ ట్రెక్కింగ్

మద్దిలపాలెం: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6 నుంచి 12వ తేదీ వరకు జాతీయ ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర కమిషనర్ నరవ ప్రకాశరావు తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని జోషిమత్, చమోలీలో 7 రోజుల పాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆరోగ్యవంతులైన 15 నుంచి 25 ఏళ్ల లోపు వారు మాత్రమే అర్హులన్నారు. పూర్తి వివరాలకు 99081 86117లో సంప్రదించవచ్చు.

7 నుంచి నూకాంబిక ఆలయ పునఃనిర్మాణ పనులు

- వచ్చే ఏడాది కొత్త అమావాస్య జాతర నాటికి పూర్తి
- ఆలయ ఈవో బండారు ప్రసాద్



నూతన ఆలయ నమూనాను ఆవిష్కరిస్తున్న ఈవో ప్రసాద్, రేజేటి రామాచార్యులు, దాడి రత్నాకర్

తుమ్మపాల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ పునః నిర్మాణ పనులను వచ్చే నెల 7వతేదీ నుంచి ప్రారంభిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ చెప్పారు. ఆలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలివిడతగా రూ.3.5 కోట్ల వ్యయంతో నూతన గర్భాలయం, అంతరాలయం, అనువెట్టిల పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మలివిడతలో రూ.5 కోట్లతో ప్రాకారమండపం పనులు చేపడతామని చెప్పారు. టీటీడీ నుంచి రూ.1.5కోట్లు మంజూరయ్యాయని, వచ్చే ఏడాది నిర్వహించే కొత్త అమావాస్యజాతర నాటికి పనులు చేసి నూతన ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. నిర్మాణ సమయంలో అమ్మవారి దర్శనానికొచ్చే భక్తులకు అసౌకర్యం ఏర్పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ఆలయ అభివృద్ధికి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావుతోపాటు ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నారని తెలిపారు. గర్భాలయాన్ని రాతికట్టుతో నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం గర్భాలయం 14 అడుగుల వెడల్పు, 14 అడుగుల పొడవు ఉందని, దీనిని 17.11 వెడల్పు, పొడవుతో నిర్మించనున్నామని చెప్పారు. 12, 14 వెడల్పు, పొడవుగల అంతరాలయాన్ని 17.11 అడుగుల పొడవు, 15.3 వెడల్పు చేస్తామన్నారు. 98 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పుతో ఉన్న ప్రాకారమండపాన్ని రాజగోపురంతో కలిపి 175 అడుగులు పొడవు, 93 అడుగుల వెడల్పుతో నిర్మిస్తున్నట్టు చెప్పారు. భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించేలా పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి రామాచార్యులు మాట్లాడుతూ ఆగమశాస్త్రం ప్రకారం ఆలయంలో శిల్పాల నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుత ఆలయాన్ని క్రమేపీ తొలగిస్తూ నియమ నిబంధనల మేరకు నూతన ఆలయ నిర్మాణ పనులు చేపడతామన్నారు. దేవాలయాన్ని మూడు భాగాలు విభజించి పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి జయవీర్ మాట్లాడుతూ 800 ఏళ్ల చరిత్రగల అమ్మవారి దర్శనభాగ్యాన్ని, ఆశీస్సులను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ఆలయానికి వచ్చినప్పుడు ఆలయ అభివృద్ధికి టీటీడీ సహకారం కోరిన వెంటనే ఆయన రూ.1.5 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. ప్రస్తుతం రూ.8.5 కోట్లతో పనులు చేపడుతున్నప్పటికీ పూర్తిస్థాయి ఆలయ నిర్మాణానికి దాదాపు రూ.11 కోట్లు ఖర్చవుతుందన్నారు. ఆలయ ముఖద్వారం 45 అడుగుల వెడల్పుతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. అన్నదాన సత్రంతోపాటు 100 గదులకూడిన కల్యాణమండపాన్ని నిర్మిస్తామన్నారు. ఈ నిర్మాణ పనులకు ఎంపీ బి.వి.సత్యవతి ఎంపీ కోటా నుంచి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రసాదపథకంలో భాగంగా ఆలయ అభివృద్ధి నిధులు మంజూరుకు ఎంపీ సత్యవతి పార్లమెంట్‌లో ప్రస్తావించాలని కోరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని త్వరలో దేవాలయ అధికారులతో కలవనున్నామని చెప్పారు. ఆలయ నిర్మాణానికి అన్ని రాజకీయపార్టీలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆలయ పునః నిర్మాణం నమూనాను ఈవో ప్రసాద్, రేజేటి రామాచార్యులతోపాటు ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'తెలుగుకు వెలుగునిచ్చిన గిడుగు'

ఏయూక్యాంపస్: తెలుగు భాషలో గ్రాంథిక వాదానికి స్వస్తి చెప్పి.. వ్యవహారిక వాదానికి శ్రీకారం చుట్టిన భాషోద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని విజయ నిర్మాణ సంస్థ అధిపతి డాక్టర్ ఎస్.విజయకుమార్ అన్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ సూచనలతో ఆంధ్ర విశ్వ కళా పరిషత్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో కళాప్రపూర్ణ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని వర్సిటీలో ఆదివారం చర్చాగోష్టి జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ భాషాభివృద్ధి కోసం గిడుగు పిడుగై విజృంభించారన్నారు. తద్వారా వ్యవహారిక భాషను ప్రామాణిక భాషగా నిలిపి..సామాన్యులకు చదువును దగ్గర చేశారన్నారు. విశ్రాంత ఆచార్యులు వెలమల సిమ్మన్న మాట్లాడుతూ గిడుగు గ్రాంథిక భాషావాదులపై భాషోద్యమ యుద్ధం చేసి విజయం సాధించారన్నారు. గిరిజన భాషకు సముచిత స్థానం కోసం సవర భాష నేర్చుకుని.. ఆ భాషలో నిఘుంటువు, వ్యాకరణ గ్రంథాలు రాసి అమరతుల్యుడిగా గిడుగు నిలిచారన్నారు. సాహితీవేత్త డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ గిడుగు వ్యక్తిత్వం చాలా గొప్పదన్నారు. శాస్త్రీయ దృక్పథంతో భాషను అధ్యయనం చేసి.. భాషలో సరళ సుందరమైన వ్యవహారికాన్ని ప్రజల భాషగా నిలిపారన్నారు. తెలుగు వెలుగు పత్రిక ద్వారా భాషాంశాలు ప్రజలకు చేరువయ్యేలా ప్రయత్నించారన్నారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావు కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త కన్నయ్య, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ నేమాని శారద, డాక్టర్ డి.ప్రవీణ, డాక్టర్ మేడా మస్తాన్‌రెడ్డి, డాక్టర్ మరడాన సుబ్బారావు, ఎ.రామకృష్ణ, డాక్టర్ ఎస్.పోలయ్య, నందూరి రామకృష్ణ, చింతా ప్రభాకర్, డాక్టర్ దేవులపల్లి పద్మజ, డాక్టర్ జి.మాలతి, డాక్టర్ సి.నిర్మలాదేవి, జె.పి.శర్మ, మణి, కె.వి.సత్యనారాయణమూర్తి, ఉప్పల అప్పలరాజు, స్నాతకోత్తర విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

అరకు సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు



ట్రాక్‌మన్‌తో మాట్లాడుతున్న డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్



శివలింగపురం నూతన టన్నెల్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలోని విశాఖపట్నం–అరకు సెక్షన్‌లో ఆదివారం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తనిఖీలు చేపట్టారు. అరకు–కొత్తవలస మధ్య జరుగుతున్న రెండవ ట్రాక్ పనులను పరిశీలించారు. శివలింగపురం ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న గుహను సందర్శించారు. పర్యటనలో భాగంగా టన్నెల్ నం.32, బ్రిడ్జి నం.242 వద్ద విధి నిర్వహణలో ఉన్న ట్రాక్‌మన్ రామన్నతో ప్రత్యేకంగా మాట్లాడారు. కీలకమైన ఈ మార్గంలో.. ట్రాక్ నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ, తమ వంతు కీలక పాత్ర పోషిస్తున్న ట్రాక్‌మన్‌లను ఆయన అభినందించారు. చీఫ్ ఇంజినీర్(కన్‌స్ట్రక్షన్) కె.ధనుంజయరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏయూలో గోపీచంద్ సినిమా షూటింగ్



ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగం వద్ద ఆదివారం గోపీచంద్ నటిస్తున్న సినిమా షూటింగ్ జరిగింది. వర్సిటీకి సెలవు కావడంతో విద్యార్థులు లేరు. దీంతో ప్రశాంత వాతావరణంలో షూటింగ్ జరిగింది. పాఠశాల విద్యార్థులతో కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ విభాగం వద్ద సినిమా కోసం శ్రీ శారద విద్యా మందిర, చంద్రగిరి అంటూ బోర్డును అమర్చారు. స్థానిక ప్రజలు, కొంత మంది విద్యార్థులు షూటింగ్‌ను తిలకించారు.

చంద్రయాన్‌-3లో మనోడు



పప్పల వెంకట ముత్యాలనాయుడు

కంచరపాలెం: ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో దేశ ప్రజలంతా ఆనందిస్తుండగా.. ఈ మిషన్‌లో ఐటీఐ జంక్షన్ భవానీగార్డెన్స్‌కు చెందిన పప్పల వెంకట ముత్యాలనాయుడు తన వంతు పాత్ర పోషించడంపై ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోర్ట్ విశ్రాంత ఉద్యోగి పప్పల అప్పలనాయుడు, వెంకటరత్నం మొదటి కుమారుడైన ముత్యాల నాయుడు ఆంధ్రా యూనివర్సిటీలో బి.టెక్ పూర్తి చేశాడు. బిట్స్ పిలానీలో ఎం.టెక్ చదివాడు. సుమారు పదేళ్ల కిందట ఇస్రోలో చేరిన ముత్యాలనాయుడు ప్రస్తుతం తిరువనంతపురంలో పనిచేస్తున్నాడు. కాగా.. తమ కుమారుడు చంద్రయాన్-3 విజయంలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని ముత్యాలనాయుడు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో స్విమ్మింగ్ కోచ్ మృతి

తగరపువలస: బీచ్‌రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వాడమొదలు సతీష్ (27) ఆదివారం మృతి చెందాడు. భీమిలి బోయవీధికి చెందిన సతీష్ నగరంలోని నోవాటెల్ హోటల్‌లో స్విమ్మింగ్ కోచ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా బీచ్‌రోడ్డులో సెల్ఫ్ యాక్సిడెంట్‌కు గురయ్యాడు. తలకు, చేతికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదివారం మధ్యాహ్నం ఆటోలో ఇంటికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భీమిలి ఏఎస్ఐ సత్తిబాబు దర్యాప్తు చేస్తున్నారు.

కింగ్స్‌దే కిరీటం

- ఏపీఎల్-2 విజేత రాయలసీమ కింగ్స్
- రన్నరప్‌గా కోస్టల్ రైడర్స్
- ముగిసిన ఏపీఎల్ రెండో సీజన్



రాయలసీమ కింగ్స్ జట్టు కెప్టెన్ హనుమ విహారీని ఎత్తుకుని ఆనందం వ్యక్తం చేస్తున్న సహచరులు

విశాఖ స్పోర్ట్స్: రాయలసీమ కింగ్స్ ఆటగాళ్లు అదరగొట్టారు. డిఫెండింగ్ చాంపియన్ కోస్టల్ రైడర్స్‌ను మట్టికరిపించారు. ఏపీఎల్ రెండో సీజన్‌లో చాంపియన్స్‌గా నిలిచారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించారు. పీఎం పాలెంలోని వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఆదివారం రాయలసీమ కింగ్స్-కోస్టల్ రైడర్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా మారడంతో 18 ఓవర్లకు ఆట కుదించారు. తొలుత కోస్టల్ రైడర్స్ బ్యాటింగ్ చేయగా ఓపెనర్ ప్రణీత్(10) 38 పరుగుల వద్ద ఔటయ్యాడు. అతని స్థానంలో వచ్చిన కెప్టెన్ రషీద్ 12 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ ధరణీకుమార్ 30 పరుగుల వద్ద హనుమవిహారీ బౌలింగ్‌లో ఔటయ్యాడు. తొలి పది ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసింది. నాలుగో వికెట్‌కు హర్షవర్ధన్‌తో కలిసి చిరంజీవి(15) 50 పరుగుల భాగస్వామ్యాన్నందించారు. లేఖజ్‌రెడ్డి సైతం ఒక పరుగుతో పెవిలియన్‌కు చేరడంతో 15 ఓవర్లలో ఐదు వికెట్లకు 122 పరుగులే చేసింది. హర్షవర్ధన్(50) 5 ఫోర్లు 1 సిక్సర్‌తో అర్ధ సెంచరీ చేసి సాకేత్ బౌలింగ్‌లో వినయ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుతిరిగాడు. చివర్లో 23 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది.

18 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. కమరుద్దీన్ మూడు, హరిశంకర్ రెండు, వినయ్‌కుమార్, సాకేత్, హనుమ విహారీ ఒకో వికెట్ తీశారు. ప్రతిగా బ్యాటింగ్ దిగిన రాయలసీమ కింగ్స్ ఓపెనర్ వీరారెడ్డి డకౌట్ కాగా వంశీకృష్ణ 3 పరుగులతో వెనక్కి మళ్లాడు. మరో ఓపెనర్ సాయిశ్రావణ్ 24 పరుగులు చేశాడు. ఈ దశలో కెప్టెన్ హనుమ విహారీకి వినయ్‌కుమార్ తోడై నాలుగో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యాన్ని అందించి పది ఓవర్లలో 97 పరుగులకు స్కోర్‌ను చేర్చారు. వినయ్‌కుమార్ 4 ఫోర్లు, 5 సిక్సర్లుతో 53 పరుగులతో వెనుతిరిగాడు. హనుమ విహారీ(46, 4 ఫోర్లు, 2 సిక్సర్లు), గిరినాథ్‌రెడ్డి (28, 1ఫోర్ 3 సిక్సర్లు) అజేయంగా నిలిచారు. వీజేడీ పద్ధతిలో 18 ఓవర్లకు కుదించి 157 పరుగుల విజయ లక్ష్యాన్ని నిర్దేశించగా.. 16.3 ఓవర్లలో 160 పరుగులతో కింగ్స్ విజయాన్నందుకున్నారు. స్టీఫెన్, ఆశిష్ రెండేసి వికెట్లు తీయగా అబ్దుల్లా ఒక వికెట్ తీశాడు.

భారీగా బ్లాక్ ఆయిల్ స్వాధీనం

- ముగ్గురిపై కేసు నమోదు

అచ్యుతాపురం(అనకాపల్లి): డీజిల్‌లో కల్తీ చేసేందుకు వినియోగిస్తున్న సుమారు 7,180 లీటర్ల వేస్ట్ సాల్వెంట్ ఆయిల్(బ్లాక్ ఆయిల్)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంలో వేస్ట్ ఆయిల్‌ను నిల్వ చేసి అమ్ముతున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి దాడి చేశారు. 45 డ్రమ్ముల వేస్ట్ సాల్వెంట్ ఆయిల్‌తో కూడిన వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని, వ్యాన్ డ్రైవర్‌తో పాటు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు.సెజ్‌తో పాటు పలు కంపెనీల్లో ఉపయోగించగా మిగలిన వేస్ట్ సాల్వెంట్ ఆయిల్‌ను హరిపాలెం వద్ద నిల్వ చేస్తున్నట్టు గుర్తించారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని సీఐ మురళీ రావు,ఎస్ఐ సన్యాసినాయుడులు తెలిపారు.

జాబ్ మేళాలో 42 మంది ఎంపిక



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధి

నర్సీపట్నం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రిషీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాబ్ మేళాలో 42 మంది ఎంపికయ్యారు. ఈ మేళాను కళాశాల కరస్పాండెంట్ కోనా సతీష్ ప్రారంభించారు. అరబిందో, హెట్రో కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మేళాకు 55 మంది హాజరుకాగా 42 మంది ఎంపికైనట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు భరత్, జగదీష్ తెలిపారు. ఎంపికైన వారికి విశాఖ స్కిల్‌హబ్‌లో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చిన అనంతరం ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు.

దుర్గాదేవికి లక్ష గాజులతో అలంకరణ



నర్సీపట్నం: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో కనకదుర్గ అమ్మవారిని ఆదివారం లక్ష గాజులతో అలంకరించారు. దుర్గాదేవిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వరాలిచ్చే తల్లికి ఆలయ అర్చకులు పూజలు ఘనంగా నిర్వహించారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని ఆదివారం కేంద్ర మంత్రి భగవంత్ ఖుభా, రూరల్ డవలప్‌మెంట్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ కనిమొళి కరుణానిధి, సభ్యులు, భారత మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అంతరాలయంలో స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమార్చన నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, శేషవస్త్రాన్ని త్రిమూర్తులు అందజేశారు. పీఆర్ఓ నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జై మత్స్యకార.. జై జగనన్న!

- 31న హార్బర్ వద్ద మత్స్యకార మహాసభ
- ఉత్తరాంధ్ర నుంచి భారీగా హాజరుకానున్న మత్స్యకారులు
- 2003 ఏప్రిల్‌లో విశాఖలో ఈ తరహా సదస్సు
- నాటి సభకు ప్రతిపక్ష నేతగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హాజరు

సాక్షి, విశాఖపట్నం: మత్స్యకారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. అందుకుగాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పడానికి మత్స్యకారులు సన్నద్ధమవుతున్నారు. ఈనెల 31న విశాఖ ఫిషింగ్ హార్బర్ వద్ద రాష్ట్రంలోనే తొలిసారిగా మత్స్యకార మహాసభను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో 2003 ఏప్రిల్ 4న మత్స్యకారులు ఇలాంటి మహాసభనే విశాఖలో నిర్వహించారు. ఆర్కే బీచ్‌లో నిర్వహించిన ఆ మహాసభలో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. సరిగ్గా ఇరవయ్యేళ్ల తర్వాత ఇప్పుడు 'జై మత్స్యకార.. జై జగనన్న' పేరిట మత్స్యకార మహాసభను నిర్వహిస్తున్నారు. 31 సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు జరిగే ఈ మహాసభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మత్స్యకారులు, మత్స్యకార నేతలు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మత్స్యకారుల బతుకులు ఎంతగానో మెరుగుపడ్డాయి. సముద్రంలో చేపలవేటపై రెండు నెలల పాటు నిషేధం అమలు సమయానికి వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద వీరికి రూ.10 వేలు చెల్లిస్తోంది. గత ప్రభుత్వంలో ఈ సొమ్ము రూ.4 వేలు మాత్రమే ఇచ్చేది. మత్స్యకార బీమా సొమ్మును రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచింది. టీడీపీ ప్రభుత్వం హయాంలో బోట్లకు సరఫరా చేసే డీజిల్‌పై లీటరుకు రూ.6 సబ్సిడీ ఇచ్చేది. అది కూడా ఆర్నెల్లు, ఏడాది తర్వాతో చెల్లించేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ సబ్సిడీ సొమ్మును రూ.6 నుంచి 9కి పెంచడమే కాదు.. ముందుగానే మత్స్యకారుల ఖాతాలో రాయితీ మొత్తం జమ అవుతోంది. మెకనైజ్డ్, మోటారు బోట్లకు రాయితీని వర్తింపజేస్తోంది. అలాగే రూ.152 కోట్ల వ్యయంతో విశాఖ ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ జరుగుతోంది.రాష్ట్రంలో పది ఫిషింగ్ హార్బర్లు, ఏడు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, పోర్టులను ఏర్పాటు చేస్తోంది.

హాజరుకానున్న మత్స్యకార నేతలు

మహాసభకు మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, తీరప్రాంత ఎమ్మెల్యేలు, పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, మత్స్యకార నేతలు హాజరు కానున్నారు. నాటి మత్స్యకార మహాసభలో వైఎస్‌తో పాటు మోపిదేవి, మల్లాడి కృష్ణారావులు పాల్గొనగా, 31న జరగబోయే మహాసభకు కూడా వీరిద్దరూ హాజరవుతుండడం విశేషం! ప్రజలకు, మత్స్యకారులకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలపడానికి, ఆయన మరలా ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతో మహాసభను ఏర్పాటు చేస్తున్నామని ఈ సభ నిర్వాహకుడు, రాష్ట్ర మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ 'సాక్షి'కి చెప్పారు.

కేజీహెచ్‌లో సేవలు సంతృప్తికరం

ఆస్పత్రిలో రోగులను పరామర్శించిన జెడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర



కేజీహెచ్‌లో రోగులతో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. వైద్యుల తీరు, అందిస్తున్న వైద్యం, భోజనంపై రోగులతో మాట్లాడి ఆరా తీశారు. ఆర్థో విభాగంలో రోగులతో మాట్లాడుతున్న సమయంలోనే టీడీపీ నాయకుడు సివేరి దొన్నుదొర రావడంతో ఇద్దరూ కలిసి ఇటీవల బస్సు ప్రమాద బాధితులను పరామర్శించారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని, ఎవరికి ఏ కష్టం వచ్చినా తెలియజేయాలని దొన్నుదొరకు సూచించారు. అనంతరం సుభద్ర విలేకరులతో మాట్లాడుతూ కేజీహెచ్‌లో ప్రస్తుతం రోగులకు అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సహకారంతో కేజీహెచ్‌లో అనేక మార్పులు తీసుకొచ్చామన్నారు. మౌలిక సౌకర్యాలు కల్పించడంలో, రోగులకు వైద్య సేవలు అందించడంలో, ఎస్టీ సెల్‌ను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయడంలో విజయం సాధించామన్నారు. ఎవరికైనా సాయం చేయడానికి తనవంతు ప్రయత్నిస్తా అని సుభద్ర అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పదవి లభించిందని, ఆ అధికారం సాయంతో గిరిజనులకు సేవ చేస్తానన్నారు. గతం కంటే ఏజెన్సీ ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఆమె పేర్కొన్నారు.